# మరో ఛాన్స్

# నైట్ మేర్ టు లైఫ్ మేట్

"ఎవరండి మీరు?"

"కనపడ్డంలేదా- నేను మీకు కాబోయే వరుణ్ణి. నువ్వు నా వధువివి."

"అలాగా... రండి - రండి... కూర్చోండి."

"కూర్చుంటాను. ఇవ్వాల్సిన వర కట్నం యిప్పిస్తే..."

"ఆ మాటే ఎలా చెప్పాలా అని మా నాన్నవాళ్ళు కిందామీదా పడ్తున్నారు. సమయానికి అంతా అందుబాటు కాలేదు. అందినంత అందుకుంటారా యిప్పటికి- మిగతాది అందగానే యిస్తాం."

"ఛలేవారే... లాభనష్టాలు బేరీజు వేసుకుని... బేరసారాలు ముగించుకుని వివాహ వ్యాపారతంతు ముగిసాక అలా అంటే ఎలా?... సప్లయ్ అండ్ డిమాం డ్ ని బట్టే గదా ఏదైనా... ఇదే వ్యాపార వేదిక మీద... కన్యాశుల్కాలు గతంలో ఇచ్చాము కామా?.... మీరు కాకపోతే మరొకరు."

"అయ్యయ్యో అలా అనకండి...మా నాన్న బాధపడ్తారు.

"అలా అనకపోతే మా అమ్మా నాన్నలు బాధపడ్తారు...ఏదో పాపం అమ్ముకొని చేసుకున్నా...ఏ మూలంగా ఈ వ్యాపారంలో నష్టం వచ్చింది గదా అని మా అమ్మ అరళ్ళు పెడుతుంది. నే నెలా ప్రవర్తిస్తానో నాకే తెలియదు. నే

నెందుకు కోరి విలవిన్ని కావాలి?"

"ఎంత కఠోరంగా మాట్లాడుతు న్నారు- వివాహం నిశ్చయమయాక మీతో కలిసి ఊహల్లో ఎన్ని కలలు కన్నాను. అవన్నీ కల్లలు చేస్తారా?"

"నేను బాధ్యుణ్ణి.... ఆ క్లర్కు సంబంధం ఐదువేలకే వచ్చినా...వారికి ఆస్థి పాస్తులు లేవని...కాదన్నారుగా. ఆ అబ్బాయి మీలా అలాగే కలలు కని ఉండొచ్చుగా... చూడండి... కొంత డబ్బు కూడిందంటున్నారు. ఆ అబ్బాయి ఇంకా పెళ్ళికాకుండా వున్నాడేమో?"

"ఆడపిల్ల సుఖం చూసుకుంటారు తల్లిదండ్రులు. ఉద్యోగం ఆస్తిపాస్తులు అన్నీ ఉంటే విశ్రాంతపడతారు. ఆడపిల్ల సుఖపడాలని కోరుకుంటారే కాని కష్ట పడాలని కాదు. లేనివాళ్ళకు అప్పులుం టాయి. కట్నం డబ్బుతో అప్పు తీర్చు కుంటారు — మిగిలిందేమిటి? కష్టాలు. కన్నీళ్ళు గదా."

"ఆస్థి ఉన్నవాళ్ళకు కట్నం ఇస్తే బ్యాంక్ బాలెన్స్‌లో చేరి నిరర్థకంగా పడి వుంది, అస్తవ్యస్తమైన వ్యవస్థను క్రియేట్ చేస్తుంది. మేం మధ్యతరగతి వాళ్ళంలెండి మా బ్రతుకులిలా వెళ్ళిపో తున్నాయి అంతే...వరకట్నం ఒక్క టేనా అవినీతి దురాచారం. చాలా వున్నాయి. అన్నీ పోతే యిదీ పోతుంది. నేను మెరిట్ స్టూడెంట్‌నై లంచం ఇస్తే కాని జాబ్ దొరకలేదు-ఇది అవినీతి కాదా— ఇది కరప్షన్ కాదా. ఎందుకు లెండి.... హెలప్."

"అయ్యో వెళ్ళిపోతున్నారా కొంచెం ఆలోచించండి..."

"ఆలోచించడానికి ఏంలేదు మేడమ్. కన్యాశుల్కానికైనా- వరకట్నానికైనా వేదిక అయిన వివాహవ్యవస్థ అలాగే వర్ధిల్లుతుంది. అది వున్నంతవరకు నేను అంటే వరుడిగా వుంటాను. నేను ఉన్న ప్పుడు వరకట్నం వుంటుంది. వేదిక- వరుడు- వరకట్నం... మొదటి రెండు కావాలి.చివరిది వద్దు అనడం న్యాయమా? అసలు శాస్త్రిని కొడితే పీడ వదులుతుంది. పీడతో పోరాడి ప్రయోజనం ఏమిటి? ఉచిత సలహా పారేస్తున్నాను. కట్నం ఇవ్వలేని ఆడపిల్లలంతా కలిసి అసలు శాస్త్రీ అయిన వివాహాన్ని పడగొడితే వరుడు-వరకట్నం అనే పీడలు అవే పడిపోతాయి."

"బాగానే ఉంది కాని..."

"కానీ ఏమిటండి- అర్థకా- అనాను. స్త్రీ పురుషులు కలిసి ఉండడానికి వివా హమే అక్కరలేదండి. విడిపోవడానికి ఆపడానికి శక్తిలేని వివాహం ఉన్నా ఊడినా ఒకటే... వధువు-వరుడు—ఇవి వ్యాపార దృక్పథపు బూర్జువా పదాలు మేడమ్. ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా అవే సంబోధనలా?"

త్రుళ్ళిపడి లేచింది రేఖ.

వ్వాట్ ఏ టెరిఫిక్ నైట్ మేర్ అను

ఉంది- అక్కా టైం ఎంతయిందో? అసలు తనెక్కడుంది? ఏం జరిగింది? ఆ... గుర్తుకువస్తుంది కట్నం డబ్బు సమకూడలేదని తెలియగానే సంబంధం వద్దన్నారు. తన కలలానే కదా ఇదంతా అని కృష్ణలో దూకింది...అయితే తను ఇప్పుడెక్కడుంది? — కనురెప్పలు తెరిచి...కలయచూసింది చిన్నగది... చంకీపాండే కలర్ ఫోటో స్మార్ట్‌గా గోడకు పెట్టి ఉంది...చిన్న బ్లాక్ అండ్ వైట్ టి.వి బల్లమీద ఉంది. ప్రక్కన బుక్ షెల్ఫ్. పైన మూడు ప్రత్యేకమైన అరలు-దలం. రంగనాయకమ్మ-అడవి బాపిరాజు- అని స్లిప్ అతికించి వుంది. అలానే క్రింద అరలో ఇంగ్లీష్ పుస్తకాలు అవీ అడుగు అరలో ఇతరములవీ...కిటికీ దగ్గర రెండు స్టీరియో బాక్సులు...ఇదేదో ఒంటరివాడి గది అనే భావన రాగానే బలవంతాన లేచి కూర్చోబోయింది.

"అయ్యయ్యో లేవకండి...ఏం కావాలి? భయపడకండి... ఉండండి హార్లిక్స్ కలిపి ఇస్తాను" పువ్వుల లుంగి బనీను మాత్రం ఉన్న యువకుడు వాలు కుర్చీలోనుంచి లేచివచ్చి అన్నాడు.

అపరిచితుని వంక ఆదోలా చూసి మిన్నకుంది లేఖ. అతను వేడివేడి హార్లిక్స్ ఇస్తే తాగింది. తిరిగి మగతగా నిద్రలోకి జారుకుంది.

"ఎవరండి మీరు?"

"ఏమిటా ప్రశ్న? నేను నీ పతి దేవుణ్ణి-నువ్వు నా సతివి."

"ఏదో పరధ్యానం. ఏమి అనుకోకండి."

"చెట్టంత పతిని గుర్తించలేని సతిని ఊరుకోవాలా? చెప్పులు ఊడదీయాలి" నడుముకున్న బెల్ట్ తీయసాగాడు

"అయ్యయ్యో... పొరపాటయింది. క్షమించండి. మీ కాళ్ళు పట్టుకుంటాను. మీ నీడలో కాలం గడపాల్సినదాన్ని. మీ దయాదాక్షిణ్యాల మీద బతకాల్సినదాన్ని...నన్నిలా హింసించకండి" కాళ్ళు పట్టుకుంది

కొంత తృప్తి కనిపించిందతన్లో. అయినా క్రూరంగానే ఉన్నాడు.

"అందుకే హింసించాలి...దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి లేనివారిని హింసిస్తే ఊరుకుంటారా?- ఎదురు తిరుగుతారు. బానిసల మీదే హింసా ప్రయోగం."

"భార్యని పట్టుకొని బానిస అంటారు నేను మీ సతినన్నారు. ఇందుకేనా?... అగ్నిసాక్షిగా పెళ్ళాడింది ఇందుకేనా?- నేను బానిసనా?"

"నువ్వునేమిటి? ఈ వ్యవస్థకు అందరం బానిసలమే. పురుషుడు వ్యవస్థకు బానిసైతే స్త్రీ పురుషుడికి బానిస."

"అంటే స్త్రీలు బానిసలకు బానిసా?"

"అవును. వ్యవస్థ నన్ను హింసించి సాధిస్తుంటే...నేను నిన్ను హింసించక

తీర్చుకుంటావా?" బెల్ట్ చెళ్ళుమంది వీపుపై.

ప్రాణం పోయినట్లయింది.

"ఇకమీద జాగ్రత్తగా ఉండు-పద పక్క ఎక్కు."

"ప్లీజ్...మనసు-శరీరం కూడా బాగాలేదు కొట్టారుగా చాలా బాధగా ఉంది...ఈ రోజుకు వదిలేయండి."

"బాగుంది...వ్యభిచారానికైతే కొనుక్కుని వివాహానికైతే అమ్ముడుపోయేది ఎందుకనుకున్నావు? ఇందుకే...పెళ్ళి ఒక లైసెన్స్...నీ ఇష్టా ఇష్టాలతో పనేమిటి?...రా..."

అతని పశుకామం తీరిపోయింది.

"ఛీ...ఛీదర...దేభ్యం మొఖం వేసుకొని. అసలు ఆడదానివేనా?...ఆ వేశ్యలే నయం-కనీసం నటిస్తుంది..." చెంప ఛెళ్ళుమనిపించాడు

"లే...కొంచెం చాయ్‌చేసి తీసుకురా"

విధిలేక నీరసంగా లేచింది...

ఒకనాడు...అతను చనిపోయాడు. అతని శవం ఎదురుగా ఉంది. చాలా ఆనందంగా వుంది. పిచ్చిగా నవ్వింది.

"అయ్యో పాపం-మొగుడు పోయాడని పిచ్చెక్కిపోయింది..." ఎవరో అంటున్నారు.

"నేనా-పిచ్చా- వీడికోసమా? భలే వాళ్ళే...నేను వీడికి బానిసనట వీడే చెప్పాడు. బానిస యజమానిపోతే బానిస సంతోషిస్తాడు. నేనూ అంతే మనస్ఫూర్తిగా నవ్వుతున్నాను. చాలారోజుల తరువాత నవ్వుతున్నాను." నవ్వు.

"మంచిదేలే... సతీసహగమనానికి ఇంకా సులువవుతుంది" ఎవరో అంటున్నారు.

"సహగమనమా? నే నెందుకు చేయాలి? సహజీవనంలో ఏం అనుభూతులు అందించాడని. అందించినా ఎందుకు చేయాలి? నేను చేయను. ఏమిటా ఆటవికం?"

"మరి పెళ్ళెందుకు చేసుకున్నావే... సతీపతులు అని అనిపించుకునేటప్పుడు తెలియలేదా? అనిపించుకోగానే సరా? నువ్వు ఆయన సతీమణివి అని చెప్పావా లేదా...కాబట్టి సహగమనం చేయి" ఎవరో శాసిస్తున్నారు.

"అయ్యయ్యో...నా నిండుజీవితం బలై పోతుంది...రక్షించేవాళ్ళు లేరా?" ఆక్రోశించింది.

"ఉంది..." గంభీరమయిన కంఠం వినిపించింది. ఇందాకటి వరుడు.

"ఓ...స్త్రీ- వధువు-వరుడు ఎలా బూర్జువా పదాలో?- సతీపతులు అలాంటి ఫ్యూడల్ పదాలు. ఇవన్నీ వివాహ వ్యవస్థను ఆశ్రయించి బతుకుతున్న పిశాచ ఆత్మలు. ఆ వివాహ వ్యవస్థను విచ్ఛిన్నంచేసి సహజీవన వ్యవస్థను స్థాపించి సహోదరులం అనే ఉమ్మడి పదాన్ని వాడితేగాని దీనికి పరిష్కారం లేదు...సతీమణి అనే పదానికి పొంగి

పోయి...సహగమనానికి వెనుకడుగు వేస్తే ఎలా? అంచేత ముందు అతనితో వున్న వివాహసంబంధాన్ని త్రెంచుకో- అప్పుడు స్వేచ్ఛ పొందుతావు. స్వేచ్ఛగా ఉన్నవాళ్ళే స్వచ్ఛంగా మనగలుగుతారు. కానీయ్-తెంచు ఆ మంగళసూత్రాలు-"

త్రెంచి అవతల పారేసింది.

"ఈ పూలు-బొట్టు తీసెయ్యనా?"

"అవన్నీ అతను వచ్చాక వచ్చినవి కావు. అవి మీ ఇష్టాయిష్టాలు. ఇక నడవండి...విశాల ప్రపంచంలోకి...బంధనాలు లేవు...మనో విహంగాన్ని వినువీధిలోకి ఎగరనీయండి...."

కళ్ళు తెరిచింది రేఖ...ఏదో జ్ఞాన దీప్తి ప్రకాశవంతమవుతున్నది.

"తెల్లారింది...కొంచెం లేచి ఫ్రెష్ అవుతారా?" అపరిచిత యువకుని వినయ పూర్వకమైన అభ్యర్థన.

నీరసంగా లేచింది రేఖ. ఒళ్లు తూలుతోంది.

"నా పేరు నితిన్...మెకానిక్ ని... ఈ పూట సెలవు పెట్టాలెండి. అదే బాత్ రూమ్...మీ చీర ఆరిపోయిందిలెండి."

అప్పుడు చూసుకుంది లుంగీ—బుష్ షర్ట్ మీదుంది.

"తప్పలేదండి...ఒక మనిషి ప్రాణం కన్నా దిక్కుమాలిన శీలం సెంటిమెంట్లు గొప్పవి కావు నా అభిప్రాయంలో..."

నిట్టూర్చింది రేఖ

అదీ కరక్టే...

'ఎంతైనా వరము ఈ బ్రతుకు— ఏమైనా వరమే ఇది మనకు' అన్న దేవులపల్లి చరణాలు గుర్తుకువచ్చాయి. తన మనసులో మాట గ్రహించినట్లు అతడు రికార్డ్ ప్లేయర్ ఆన్ చేసాడు.

"దునియామే హమ్ ఆయే హైతో
జీనాహీ పడేగా
జీవన్ హై అగర్ జహర్ తో
పీనాహీ పడేగా."

ప్రపంచంలోకి వచ్చినందుకు బ్రతికే తీరాలి. జీవితము విషమైతే తాగేతీరాలి.

మౌనంగా లేచి బాత్ రూమ్ కు నడిచింది.

స్నానం చేసి రాబోయేసరికి-బ్రెడ్ స్లైసెస్ చాయ్ సిద్ధంచేసి ఉంచాడతను.

మొహమాటంగా ఫీలయింది రేఖ.

"ఎందుకింత శ్రమ తీసుకుంటున్నారు?"

"శ్రమేముందిలెండి—అంతగా రుణం తీర్చుకోవాలనిపిస్తే నేను చావాలనిపించినప్పుడు చెప్తాను. రక్షించి - తీర్చేసుకొండి...ముందు బ్రేక్ ఫాస్టు తీసుకోండి" నవ్వుతూ అన్నాడు నితిన్.

రేఖ నవ్వింది.

"ఇప్పుడు చెప్పండి మీకెందుకు బ్రతకాలనిపించిందో- అదే చావాలనిపించిందో...నే నప్పుడప్పుడు అలానే మాట్లాడుతుంటాలెండి. మీరు రివర్స్ గా రిసీవ్ చేసుకోవాలి" బ్రెడ్ కు జామ్ పూస్తూ అన్నాడు నితిన్.

అంతా చెప్పి రిలీఫ్‌గా ఫీలయింది రేఖ.

"వెరీగుడ్...మీ ఇంటి అడ్రస్ చెప్పండి..."

రేఖ మౌనం వహించి తిరిగి అంది. "మీ రొక్కరే ఉంటున్నారా?"

"అవునండి నేనొక్కడ్నే వుంటున్నాను. అమ్మ పల్లెలో ఉంటుంది..."

"మరి మీరు పెళ్ళిచేసుకోవాలనుకో లేదా?"

"చేసుకున్నవాళ్ళు ఏం సుఖపడుతున్నారో చూస్తున్నాంలెండి...కలిసుండాలంటే పెళ్ళే అక్కరలేదు. విడిపోయే వాళ్ళను పెళ్ళి ఆపుతుందా?"

సరిగ్గా కలలో ఇవే మాటలు.

"నేను రెండు రకాల పీడ కలలు కన్నాను- మీరన్న మాటలు ముక్తాయింపుగా అందులో వచ్చాయి—చాలా అభ్యుదయకరమైన వాదాలు వినిపించాయి అంత పీడకలలో కూడా. బహుశా మీలాంటి అభ్యుదయవాదుల గది అయినందువలన, ఇందరు సాహితీమూర్తులు కొలువై వున్నందువల్ల కావచ్చు... ఒకటి ఒకటి కూడితే రెండు ఇది గణితం- ఒకటి ఒకటి కూడితే ఒకటే యిది జీవితం అన్నారు. అలాంటి జీవితం మీతో పంచుకోవాలనుకుంటున్నాను...అంగీకరిస్తారా?" పుస్తకాల షెల్ఫ్ నుంచి 'స్వీట్‌హోం' అందుకుని అంది రేఖ.

అందంగా సిగ్గుపడ్డాడు నితిన్.

అపురూపంగా నవ్వాడు నితిన్

"ఒక్క నిమిషం..." అని డ్రాయర్ నుంచి కళ్ళద్దాలు తీసి పెట్టుకున్నాడు.

"ఇప్పుడు అచ్చం బుచ్చిబాబులా ఉన్నానా?" అద్దంలో చూసుకుంటూ అన్నాడు

సంతృప్తిగా చూసింది రేఖ.

"చూడండి రేఖగారు. అయితే పెనం లేకుంటే పొయ్యి అన్నట్లు ఇస్తే వరకట్నం లేదా ఆస్తిపాస్కు కాదు ఆడపిల్లకు కావలసింది. సాంఘిక-ఆర్థిక స్వేచ్ఛ అర్థంచేసుకోవాలి మీరు చలం చెప్తారు. స్త్రీకి మెదడుంది దానికి జ్ఞానం కావాలి హృదయం వుంది అనుభూతి కావాలి శరీరం వుంది వ్యాయామం కావాలి మగాడు తెచ్చి పడేస్తుంటే స్త్రీ వండి పడేస్తుంటే, లైఫ్‌లో థ్రిల్ పోతుంది. మీ ప్రత్యేక వ్యక్తిత్వం నాకు కావాలి. నా లైఫ్‌మేట్ ఫలానా అని నేను చెప్పుకోగలగాలి..."

ఆర్ద్రోక్తిలో ఆగాడు నితిన్.

రేఖ ఆలోచిస్తోంది

కలా? నిజమా?- నమ్మశక్యంగా లేదు. ఇంతవరకు గమనించనేలేదు. చంకీపాండే ఫోటోకి ఎదురుగా అందముగా ఆరోగ్యకరంగా చిరునవ్వులు చిందిస్తున్న 'నీలమ్' ఫోటో ఉంది. అప్రయత్నంగా అటు అడుగేసింది. చంకీపాండే ఫోటో దగ్గర చేతులు కట్టుకుని కాలు కొంచెం మెలివేసి నిల్చు



న్నాడు నితిన్. కాసేపలాగే నిలబడి విశాలమైన బాహువులు చాచాడు నితిన్. మంత్రముగ్ధలా నడిచి అతని బాహువుల్లోకి ఇమిడిపోయింది రేఖ.

ఆలింగనంలో అనుభూతి అపూర్వంగా ఉంది.

చుంకి పొందే మరింత రొమాంటిక్‌గా ఉన్నట్లనిపించాడు. ఆటు మాటిగా చూడలేక నితిన్ గుండెల్లో ఒదిగిపోయింది రేఖ.

• • •